పాకుడుబంధం

పోల్కంపల్లి శాంతాదేవి

బస్సులో ఆరుగంటలు ప్రయాణంచేసి బస్సు దిగి ఆటోలో ఇంటికి వచ్చేసరికి కొత్త పెళ్ళి కూతురు జయలక్ష్మి తోటకూర కాడలా వేలాడి పోయింది!

మురళీధర్ తాళంతీసి సామాను లోపలికి చేర్చాడు.

అంత అలసటలోనూ తాను కాపురముండ బోయే ఆ అద్దె ఇంటిని కుతూహలంగా చూచు కొంది జయలక్ష్మి. ఇరుకుగా ఉన్న రెండు గదులు. వెనుక ఉన్న కాస్త పెరడూ పక్క పోర్షన్ వాళ్ళు కూడా పంచుకొంటారు. బాత్ రూం, లావెట్రీ కంబైండ్!

"చిన్నదైనా కాస్త అన్నిటికీ సెపరేట్‌గా ఉండేలా తీసుకోకూడదా ఇల్లు."

"ఇది హైదరాబాద్, డియర్! ఈ మాత్రం పోర్షన్ సంపాదించేసరికి నా తాతలు దిగివచ్చారు! నాకొచ్చే ఆరు వందల జీతంలో ఈ పోర్షన్ నూట ఏభై రూపాయల్ని మింగేస్తుంది!"

బ్రహ్మచారిగా ఉన్నప్పుడు మురళీధర్ తన ఫ్రెండ్సుతో కలిసి ఒక రూంలో ఉండే వాడు. మెస్సులో తినేవాడు. వారం రోజుల క్రితమే జయలక్ష్మితో అతడికి వివాహం జరి గింది. అప్పటి కప్పుడు ఈ పోర్షన్ అద్దెకు తీసుకొని భార్యను కాపురానికి తీసుకువచ్చేశాడు.

మరునాడు.

తన అభిరుచి కనుగుణంగా ఇంట్లో సామాను సర్దుకొంది జయలక్ష్మి. పక్కింటి రుక్మిణితో పరిచయం ఏర్పరుచుకొంది.

సాయంకాలం స్నానంచేసి తెల్ల చీరకట్టు కొని, తల్లో మల్లెపువ్వులు పెట్టుకొని భర్త కోసం నిరీక్షించసాగింది. ఆఫీసునుండి తిన్నగా వచ్చేస్తే ఆరుగంటలకల్లా వచ్చేయాలి ఆయన!

ఆరు దాటింది. ఏడు దాటింది. మురళీధర్ రాలేదు.

జయలక్ష్మి కాలుగాలిన పిల్లిలా అటుఇటు తిరుగుతూనే అన్నం వండేసింది. వీక్లీలు, మంత్లీలు తిప్పేసింది. విసుగొచ్చి అవి ఓ పక్కన విసిరేసి టైం చూసింది. పదిదాటి పోయింది!

ఆయన ఎందుకు రాలేదు? కొత్తగా కాపురం పెట్టిన జంట? తనకుండే ఆత్రుత ఆయనకి లేదా?

కడుపులో ఆకలి చురుక్కు మనసాగింది. కళ్ళమీదికి నిద్ర తూగసాగింది.

తలుపుమీద టకటక కొట్టిన శబ్దం, 'జయా' అన్న పిలుపూ వినవచ్చాయి.

జయలక్ష్మి తలుపు తెరిచి, "మీకు పెళ్ళ యిందని, ఇంట్లో మీకోసం నిరీక్షించే భార్య ఉంటుందని మరిచి పోయారులా ఉంది!" అంది నవ్వుతూ.

"మరిస్తే ఇంటికెలా వస్తాను?"

ముద్దగా వస్తూన్న ఆమాట, కాస్త ఉబ్బి నట్టుగా ఉన్న ఆ కళ్ళు చూసి గతుక్కుమంది జయలక్ష్మి. "తాగారా? మీకు తాగుడు అల వాటుందా?"

భర్తను భార్య అడుగుతున్నట్టుగా కాక భర్త భార్యను అడుగుతున్నట్టుగా దబాయిం పుగా వినిపించింది ప్రశ్న! చిరాకుతో ముఖం చిట్లించుకొన్నాడు మురళీధర్. కొత్తపెళ్ళాంతో ఇప్పుడే దెబ్బలాట తెచ్చుకోవడం ఇష్టంలేక తన చిరాకును కప్పిపుచ్చుకొని శాంతంగా జవా బిచ్చాడు. "మా ఫ్రెండొకడు ట్రాన్సఫరై

వెళ్ళిపోతున్నాడు, పార్టీ ఇచ్చాడు."

జయలక్ష్మి మరోమాట మాట్లాడకుండా కంచాలు పెట్టడానికి వెళ్ళింది.

"నువ్వింకా తినలేదా? తినాల్సింది! నేను తినివచ్చాను. నువ్వు త్వరగా తినేసి వచ్చెయ్యి?" బూట్లు విప్పి మూలకి తన్నేసి గుడ్డలుకూడ మార్చుకోకుండా పక్కమీద పడ్డాడు. తెల్లటి పక్కమీద గుబాళిస్తూ మెత్తగా ఒంటికి తగిలాయి మల్లెపువ్వులు! కళ్ళమీదికి ముంచుకు వస్తూన్న మత్తును బలవంతంగా పక్కకి నెడుతూ భార్యకోసం ఆత్రుతగా నిరీక్షించసాగాడు.

జయలక్ష్మి వచ్చింది.

"అప్పుడే భోజనం అయిపోయిందా? అయిదు నిమిషాలుకూడా కాలేదు!"

"ఊహుం, నేను తినలేదు."

"ఎందుకు?"

"ఇక ముందెప్పుడూ మీరు నన్ను ఇంట్లో ఆకలికి వదిలేసి బయట మెక్కిరాకుండా— మీకిది శిక్షగా ఉండాలని!"

అతడు మాట్లాడలేదు. క్షణం ఆలస్యం కావడం సహించలేనట్టుగా జయలక్ష్మిని చెయి పట్టి మీదికి లాక్కున్నాడు. అతడి కౌగిలిలో, ముద్దులతో జయలక్ష్మికి ఊపిరాడనట్టుగా

అయింది. అతడి నోట్లోంచి వస్తూన్న వాసనకు డోక్కున్నంత పనిగా ఉంది!

అన్నం తిననందుకు తనను ప్రాధేయపడతాడని, తన కోపం పోగొట్టడానికి ప్రయత్నించి తనచేత అన్నం తినిపిస్తాడని జయలక్ష్మి ఊహ పూర్తిగా తలక్రిందులై పోయింది.

మురళీధర్ తనకోరిక తీర్చేసుకొని పక్క మీద గుర్రుపెట్టసాగాడు.

జయలక్ష్మి కళ్ళ నిండా నీళ్ళు!

ఆరువందల జీతం తెచ్చుకోవడం, అబ్బాయి అందంగా ఉండడం ఇది చూడగలిగిన తలిదండ్రులు పదివేల కట్నమచ్చి, అయిదువేలు లాంఛనాలిచ్చి, పైన అయిదువేలు ఖర్చుపెట్టి పెళ్ళి చేశారు, ఇహ అమ్మాయి సుఖపడిపోతుందని. కనిపెంచినందుకు మంచిచోట ఇచ్చామని తృప్తిపడిపోతుంటారు!

కాపురానికి వచ్చి నిండా రెండు రోజులు కాలేదు. అప్పుడే తన కాపురంలో చిన్న అగ్నికణం పడింది! రాజుతోంది!

* * *

రాత్రి పన్నెండు గంటలవుతోంది.

వీధి తలుపు తెరిచి గడప మెట్టుమీద భర్త రాకకోసం నిరీక్షిస్తూంది జయలక్ష్మి.

పక్కింటి రుక్మిణిచూసి, "ఇంత రాత్రివేళ తలుపు తెరుచుకు కూర్చోవడం ఏమిటి జయా? నువ్విలా తలుపు తెరిచి కూర్చోకపోతే వచ్చినవాడు ఇంట్లోకి రాకుండా వెనక్కి వెళ్ళిపోరాదా? ఇంతరాత్రిప్పుడు తలుపులు తీసి ఉంచడం క్షేమంకాదు. అలాపోయే వాడికి దుర్బుద్ధి పుట్టగలదు!" అంది.

"ఏం చేయను? పిచ్చెత్తినట్టు ఉంటుంది. పెళ్ళికాక ముందు వైవాహిక జీవితం గురించి ఎన్నికలలు కన్నాను! అందులో ఒక్కటైనా నిజం కాలేదు! నిజంగా యీ నరకాన్ని నువ్వు ఊహించలేవు, రుక్మిణీ!"

జయలక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరగడం చూసి చలించింది రుక్మిణి. "నువ్వు ప్రతిరోజు అన్నం మానేసి నిరీక్షించి ఏం సాధిస్తున్నావు?"

"ఇద్దరికోసం వండుకొన్న అన్నాన్ని— ఆయన రాకుండా ఒక్కదాన్నీ తినాలంటే మనసొప్పదు! తనకోసం నేను అన్నం తినకుండా ఉంటానని తెలిసీకూడా ఆయన వేళకు రావడానికి ప్రయత్నించరు. అసలు ఆయనకు హృదయం అనేది ఒకటుందాని నాకు అనుమానం వస్తూంది!"

* * *

"ఇవాళ పిక్చర్ ప్రోగ్రాం వేసుకొందామండీ!"

"ఆ ప్రోగ్రాం ఏదో నువ్వే వేసుకో, జయా! సన్ డే వచ్చిందంటే నాకెంత బిజీ! క్రితంసారి పోగొట్టుకొన్న రెండు వందలు తిరిగి సంపాదించుకోనిదే నాకు నిద్రపట్టదు!"

"ఒక్కదాన్ని పిక్చర్‌కి వెడితే ఏం ఉత్సాహం ఉంటుంది?" నీరు గారిపోయి అంది జయలక్ష్మి.

"పక్కింటావిణ్ణి పిలువు! కావాలంటే టికెట్ నువ్వే తీసుకో, ఆవిడకు కూడా."

"పక్కింటావిడ కబుర్లతో బోర్ కొడుతుంది. పక్కింటాయన్ని పిలుస్తాను."

మురళీధర్ చెయి పైకి లేచింది.

"ఆ చెయి అక్కడే ఆగాలి. లేకపోతే, పెళ్ళాంతో తన్నులు తిన్న భర్తగా ఊరూవాడా ప్రసిద్ధులై పోతారు!"

"నీకెంత పొగరు?"

"మీకంటే తక్కువేదుగాని, నాకంటే తిక్కా!"

"ఆడదానివి కాదు. పోట్లగిత్తవి!"

"ఆవులాగా సాత్వికంగా ఉంటే అరికాలికింద అణచి పెట్టరూ?"

"ఇప్పుడేదో మీజాతి పొడిచేస్తున్నట్టు!"

మురళీధర్ విసురుగా బయటికి వెళ్ళిపోయాడు.

అతడటు వెళ్ళగానే రుక్మిణి వచ్చింది.

"మళ్ళీ పోట్లాడుకొన్నట్టున్నారే?"

"రోజూ ఉండేదేగా? నాకిక్కడ నరకంగా ఉంది, రుక్మిణీ! మా ఊరికి వెళ్ళిపోదామని పిస్తోంది."

"వెళ్ళినా మళ్ళీ రావలసిందేగా?"

"ఎందుకు రావాలి?"



"అదేం ప్రశ్న?" విడ్డూరంగా చూచింది రుక్మిణి. "మీవాళ్ళు నిన్ను ఎంతకాలం భరిస్తారు?"

"భరించకపోతే ఎందుకు కన్నారు?"

"కన్నందుకు పెళ్ళిచేసారు. అత్తారింటికి పంపేశారు. వారి బాధ్యత అక్కడితో తీరి పోయింది. అయినా నువ్వు కోపంతో అంటు న్నావుగాని నువ్వు మాత్రం అక్కడ ఉండి పోగలవా? వారం రోజులయ్యేసరికి మీ ఆయన మీద మనసు పీకి పరిగెత్తుకు రావూ?"

"రాను." జయలక్ష్మి దృఢంగా అంది.

"బడాయి!" రుక్మిణి నవ్వింది. "పెళ్ళ యిన ఆడదానికి అత్తవారింట్లో ఉన్నప్పుడే గౌరవాదరణలు లభించేది. భర్తను వదిలి ఉంటానంటే వాళ్ళే ఒక నరకం చూపుతారు."

"చూపనీ, ఈ నరకం కంటే ఆ నరకం నయమే."

"నువ్వు ప్రతిదాన్నీ సీరియస్‌గా తీసుకొనే దానిలా ఉన్నావు! మగవాళ్ళ బలహీనతలు కొన్ని మనం పట్టించుకోకూడదు. కొన్ని సర్దుకు పోవాలి. అదను చూసి వాళ్ళ ముక్కున తాడు వేయాలి!"

"నీ భర్త ఆరింటికల్లా ఇంటికి వస్తాడు. పిల్లలను ఆడిస్తాడు, ప్రతి ఆదివారం భార్యతో, పిల్లలతో సినిమాకో, షికారుకో వెడతాడు. ప్రతి ఆడదీ నిన్ను చూసీ ఈర్ష్యపడేలా ఉన్న అనురాగ దాంపత్యం నీది! నీకు నా బాధ అర్థం కాదు, రుక్మిణీ!

"నేను కాపురానికి వచ్చి నెలరోజులైంది. ఏ రోజూ ఆఫీసునుండి తిన్నగా ఇంటికిరాడు. ఏ పన్నెండింటికో వస్తారు. రాకపోతే అదీ లేదు. ఎవతింటిలో గడిపేస్తారో? కనీసం సెలవు రోజైనా ఆయనతో గడుపుదామంటే-ఆ రోజు ఇంకా ఎజీ! త్రాగుడూ, వ్యభిచారం, జూదం- సప్తవ్యసనాలంటారే—అన్నీ ఉన్న మహా పురుషుడు నా భర్త! ఈయన్ని మార్చుకోనడ మనేది ఈ జన్మకాదు కదా, ఏ జన్మలోనూ సాధ్యంకాదు."

"రెండు సంవత్సరాల క్రితం నువ్వున్న స్థానంలో నేనున్నానంటే నువ్వు ఆశ్చర్య పోతావు,"

"నన్ను ఓదార్చడం కోసం నువ్వు ఏవో అబద్ధాలు కల్పించాల్సిన అవసరం లేదు!"

"అబద్ధాలు కావు, జయా! ఆరేళ్ళుగా మేం

ఇదే పోర్షన్‌లో ఉంటున్నాము. ఎవరి నడిగినా చెబుతారు మా కథ. మీ ఆయన వ్యవహార మంతా బయట నడుస్తోంది! మా ఆయన మిత్ర బృందాన్ని ఇంటికే ఆహ్వానించేవారు. ఆడుతోంటే ఎంతరాత్రి అయిందీ వాళ్ళకు తెలివి ఉండేది కాదు. ఎంత డబ్బు పోయిందీ లెక్క ఉండేది కాదు! ఒక్కోసారి తెల్లవారి పోయేది. నేను పిల్లలతో వంటగదిలో ముడిగి చచ్చేదాన్ని. టీ అని కేకేసి నప్పుడల్లా సర్వ ర్‌లా టీ అందించివచ్చి కూర్చునేదాన్ని. వాళ్ళ అరుపులకు, ఈలలకు నిద్రపట్టేది కాదు! నువ్వు ఒక్క నెలరోజులకే పుట్టింటికి వెళ్ళి పోతానంటున్నావు! నేను అయిదేళ్ళ తరువాత, ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత ఆ నిర్ణయానికి వచ్చాను. అప్పటికి ఒంటిమీది నగలన్నీ హరించుకు పోయాయి. అప్పులు పెరిగి పోయాయి. పిల్లలకి సుస్తీ అయితే మంది ప్పిద్దాం అన్నా ఇంట్లో డబ్బుండేది కాదు! ప్రార్థించి, బెదిరించి, తిట్టి, ఏడిచి—ఎన్ని అవస్థలు పడాలో అన్నీపడ్డాను-దేనికీ లొంగని వారు నేను దూరమై పోతానంటే, పిల్లల్ని కూడా నాతో తీసికెళ్ళి పోతానంటే లొంగారు. ఆయనకి ఎంత జూద వ్యసనమున్నా నేనన్నా, పిల్లలన్నా చాలా ప్రేమ. ఒక్కరోజు కని పించకపోతే వుండలేక పోయేవారు. అలాంటిది నేను శాశ్వతంగా వెళ్ళిపోతున్నా ననేసరికి, ఇంకెప్పుడూ ఆడనని పిల్లలమీద ఒట్టేసు కొన్నారు! ఒట్టుకు కట్టుబడ్డారు. ఆటా గీటా అంతా బంద్! తిన్నగా ఇంటికి వచ్చేసి పిల్ల లతో గడిపేస్తారు!"

"ఎక్కడిదో సినిమా కథ! అంత జూద వ్యసనమున్న మగవాడు ఒట్టుకూ కట్టుబడడూ, మరి దేనికీ కట్టుబడడు! ఇలాంటి మనుషులు మారుతారంటే నేను నమ్మను."

"స్త్రీకి సహనం అవసరం, జయా! సాధ్య మైనంతవరకు మగవాణ్ణి మార్చుకోడానికి ప్రయత్నించాలి!"

"ఎలా ప్రయత్నించాలి?"

"అతడికి నచ్చినట్టుగా ఉండి అతడి మనసు చూరగొనాలి! "

"ఈ పతివ్రతా ధర్మాలు నాతో చెప్పొద్దు! నాకు నచ్చినట్టుగా అతడు నడుచుకొంటున్నాడా? అతడికి నచ్చినట్టుగా నేను నడుచుకోవడానికి? ఏమిటి ఈ మగవాళ్ళ గొప్ప?" ఉద్రేకంతో అడ్డుపడింది జయలక్ష్మి. "అతడి మనసు ప్రయ త్నించి పొందాల్సినంత అవసరం నాకేంలేదు! భార్య మనసు తెలుసుకోలేనివాడు, భార్య కనీ సపు కోరిక తీర్చలేనివాడు అసలు పెళ్ళెందుకు చేసుకోవాలి? వంటకీ పంటకీనా?"

"ఇలా ఆవేశపడితే లాభంలేదు! ఏమిటీ ఈ మగవాళ్ళ గొప్ప అని అంటున్నావు? ఏ గొప్ప తనం లేకుండానే పదివేల కట్నం మిచ్చి కొన్నావా మీ ఆయన్ని?"

"మావాళ్ళకు బుద్ధిలేదసలు!"

"అలా బుద్ధిలేనివాళ్ళు చాలామంది ఉన్నారు ఈ ప్రపంచంలో!"

*   *   *

కొడుకు దగ్గర నాలుగు రోజులుండి పోవా లని వచ్చింది జయలక్ష్మి అత్తగారు చంద్రా వతమ్మ. కొడుకు నడతా, కోడలి ధోరణీ ఆవిడ ఒక్క రోజులో పసిగట్టింది!

"పెళ్ళయితే నన్నా వీడు మారుతాడను కొంటే ఏమీ మారలేదన్నమాట!" అని సణ గడం మొదలు పెట్టింది.

"మీ కొడుకు తిరుగుబోతూ, తాగుబోతూ అని తెలిసికూడా ఒక ఆడపిల్ల గొంతుకోయ డానికి మీ మనసు ఎలా అంగీకరించింది?" జయలక్ష్మి ప్రశ్నించింది."

"మార్చుకోవడం చేతగాక నన్నంటావేం? ఈ లోకంలో ఎంతమంది తాగడంలేదు! తిర గడంలేదు?" అత్తగారు గొంతు పెంచింది.

"పాతికేళ్ళు పెంచిన వారు మీ కొడుకును మార్చలేదుగాని ఇప్పుడువచ్చి నేను మార్చ లేదంటారేం? మార్చుకోవాలి! మార్చుకోవాలి. మార్చుకోవాలి! ఎవరు చెప్పినా ఇదే డైలాగు! అదేదో సినిమాలో సావిత్రి సాని కొంపపట్టుకు వదలని తన తాగుబోతు మగడికోసం వేషం వేసుకొన్నట్టుగా సానిదానిలా వేషం వేసుకోనా?

అతడికో గ్లాసు తాగించి, నేనో గ్లాసు తాగి "ఇలా ఉండిపోనీ నీదాసినై' అని ఓపాట పాడనా? అలా చేసినా జగ్గయ్యలా హఠాత్తుగా మారిపోవడానికి ఇది సినిమానా, అత్తగారూ?"

"ఆడదానికి ఇంత పెడసరితనం పనికిరాదు!"

"పనికివచ్చేదేమిటి? మెతకదనమా? కలసి సినిమాకు వెళ్ళాలన్న కనీసపు కోరిక తీర్చలేని మగవాడి కోసం నన్నేం చేయమంటారు? ఏం త్యాగం చేయమంటారు?"

"పాతకాలపు దాన్ని! నాకీ నవలల మాటలు అర్థం కావు, తల్లీ!"

"ఇవి నవలల మాటలు కావు! నా గుండె మండి వస్తూన్న మాటలు' ఎన్ని కలలతో భర్త ఇంట అడుగు పెట్టాను! నాకు ఎదురైంది ఏమిటిక్కడ? భార్య అనే దానికీ ఒక మన సుంటుందనీ, కోరిక లుంటాయనీ, అవి తీర్చ వలసిన బాధ్యత తనమీద ఉంటుందని తెలిసినా పట్టనట్టుండే భర్తతో కాపురం' కోరికలు తీర్చకపోతే మానె! కనీసం ఒక గంట సర దాగా నాతో కబుర్లు చెప్పుకొన్న పాపాన పోయారా? ఆయన మనసెప్పుడూ ఆ వ్యస నాలమీద ఉంటుందాయె!"

ఏనూ ఆడదే కనుక కోడలిబాధ అర్థం చేసుకొన్న చంద్రావతమ్మ కొడుకును మంద లించింది— "ఎప్పుడూ ఆ తిరుగుళ్ళేమి టిరా?" అని.

"మగవాడిని. తిరుగుతాను! ఇంట్లో పెళ్ళాం కొంగుపట్టుకు కూర్చుంటే వచ్చేదేమిటి?"

భర్త సమాధానానికి మండిపడింది జయ లక్ష్మి. "సంసారానికి నిండుదనం! ఆలు మగల అనుబంధానికి ఒక అర్థం!"

"నీ వెంట సినిమాలకూ, షికార్లకూ తిరి గితే సంసారానికి నిండుదనం వస్తుందా?"

"సినిమాలకూ, షికార్లకూ అక్కరలేదు. అవి లేకుంటే నా ప్రాణం ఏం పోదు! మీ సమయాన్ని కనీసం కొన్ని గంటలయినా నా కోసం ఉపయోగించలేరా? మిమ్మల్ని తిరు గొద్దని నేను ఆంక్ష పెట్టడంలేదు. ఆ తిరు గుడికి ఒక హద్దు ఏర్పరుచుకొమ్మని కోరు తున్నాను!"

"నన్ను తిరుగొద్దని, హద్దులో ఉండమని చెప్పడానికి నువ్వెవతివి!"

"ఎవతెనో అయితే నాకేం పట్టింది? భార్యని కనుక చెప్పాల్సి వస్తోంది!"

ఈ గొడవలో నేనెందు కనుకుందేమో వారం పదిరోజులుండాలని వచ్చిన చంద్రా వతమ్మ నాలుగు రోజులకే వెళ్ళిపోయింది. వెడుతూ కోడలికి హితవు చెప్పింది. "మగ వాళ్ళకి మాటకి మాట ఎదురు చెబితే రెచ్చి పోతారు. కాస్త సౌమ్యంగా ఉండి వాడిని దారికి తెచ్చుకో! పంతాలకీ, పట్టుదలలకీపోతే నీ కాపురమే చెడుతుంది!"

* * *

జయలక్ష్మి వాళ్ళ ఇంటికి నాలుగిళ్ళవతల కుమారి అనే ఆవిడ ఒంటిమీద కిరోసిన్ పోసుకొని కాల్చుకొని చచ్చిపోయింది. కారణం భర్త వ్యసనాల్నీ, వాటివల్ల సంసారానికి పట్టిన దరిద్రాన్నీ, అవమానాన్నీ భరించలేక!

"ఒక రోజు నేనూ అదే పనిచేస్తానేమో!" జయలక్ష్మి అంది భర్తకి వినిపించేలా!

మురళీధర్ ఏమనుకొన్నాడో ఆ రోజంతా బయటికి వెళ్ళలేదు. మరునాడు బొద్దుటే ఈ రోజు తొందరగా వంటముగించు. భోజనం చేసి షాపింగ్‌కు వెడదాం!" అన్నాడు.

ఏం కొనాలి? ఏం చేయాలి? అన్న ప్రశ్న లేవీ వేయకుండా జయలక్ష్మి వంట ముగిం చింది. భోజనాలయ్యాయి.

"మరీ మూగబొమ్మలా అయిపోయావేమిటి ఈ మధ్య? నీ మౌనం కంటే నువ్వు పోట్లాడు తుంటేనే బాగుంటుంది నాకు!" షాపింగ్ ముగించుకొని ఇంటికి వచ్చాక అన్నాడు మురళీధర్. మరునాడు పండుగకు జయలక్ష్మికి చీరా, బ్లవుజ్‌పీస్ తేద్దామనే భార్యను తీసుకు వెళ్ళాడు. చీర సెలెక్షన్ తనమీదే వదిలేసి దిక్కులు చూస్తూ నిల్చుంది. ఆమె తనమాటకు మాట ఎదురు చెప్పడంవల్ల ఎంతకోపం తెప్పిం చేదో ఈ మౌనం రెట్టింపు బాధను కలుగ జేస్తోంది! జయకి మనసు బాగాలేదు! అది తన



ప్రవర్తనవల్లే; తను స్నేహితులతో, ఆటలతో, తాగుళ్ళతో బయట గడిపేస్తూ ఉంటాడు! జయకేముంది ఇంట్లో? తన కోసం కాచుకు కూర్చోవడం తప్ప! తను కొంచెం తన వ్యసనాలని వదిలించుకోవాలి! ఆమె దగ్గర ఎక్కువ కాలం గడపడానికి ప్రయత్నించాలి! జయ తన నుంచి కోరేది అదేగా? మురళీధర్ అలా నిశ్చయం చేసుకొన్న క్షణంనుండి జయలక్ష్మిలో ఏర్పడిన ఈ మూగతనాన్ని, జడత్వాన్ని వదల్చడానికి ప్రయత్నించసాగాడు కబుర్లతో, జోకులతో!

మర్నాడు పండుగ భోజనం సుష్టుగా పట్టించి "గిన్నెలు వచ్చాక కడుక్కోవచ్చు' త్వరగా తయారవ్వు!" అన్నాడు.

"ఎక్కడికి?"

"మాట్నీ షో. ఆలుమగలు!"

పదినిమిషాల్లో తయారయింది జయలక్ష్మి.

కొత్త చీరలో అందంగా మెరిసిపోతున్న ఆమెను చూసి వివశుడయ్యాడు మురళీధర్. కౌగిలిలోకి తీసుకొని గుండెలకు గట్టిగా అదుముకొన్నాడు. "ఇవాళ చాలా అందంగా కనిపిస్తూ నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నావు, జయా! ఆ మాట్నీ షో మానేసి ఇంట్లో మాట్నీ షో మొదలు పెడదామనిపిస్తోంది!"

"ఛీ! మీకెప్పుడూ అదే ధ్యాసా? చీరంతా ముడుతలు పడేలా చేశారు!" ముద్దుగా గొణుగుతూ విడిపించుకొంది జయలక్ష్మి.

"చూడు! ఇప్పటినుండి నేను స్నేహితుల్ని, అన్నిటినీ వదిలించుకొంటాను. నీతోడిదే నా లోకంగా మార్చుకొంటాను' నువ్వు ఈ రోజులాగే సంతోషంగా ఉండాలి! కోపంవస్తే మాట్లాడు! నాకేం కోపంలేదు!"

"తాగుబోతుల మాటలు ఇలాగే ఉంటాయి!"

"నీ మీద ఒట్టు! రేపటినుండి చూడు ఆఫీసునుండి తిన్నగా ఇంటికి వచ్చేయకపోతే? నీతో కబుర్లు చెప్పుకొంటూ గడిపేస్తాను!"

"అంతకంటేనా?" జయలక్ష్మికి గాలిలోకి తేలిపోతున్నట్టుగా అనిపించింది. ఆమె తాళం కప్ప తీస్తూండగానే వీధి తలుపుమీద టకటక శబ్దం వినిపించింది.

మురళీధర్ తలుపు తీశాడు.

"ఇంట్లో ఏం చేస్తున్నావోయ్ మొన్నటినుండి? రాజారావింట్లో ఆట మహాజోరుగా సాగుతోంది. నువ్వు రానందుకు మాకు పెద్ద

లోటుగా ఉంది! అసలు మజానేలేదు! నిన్ను లాక్కురమ్మని రాజారావు ఆజ్ఞ!" అన్నాడు వచ్చిన మిత్రుడు.

"మా వైఫ్‌తో సినిమాకు వెడుతున్నానే!"

"సాయంత్రం రాజారావు పార్టీ."

ఆ తరువాత మాటలు వినిపించలేదు జయ లక్ష్మికి. అయిదు నిమిషాల తరువాత "జయా! తలుపేసుకో" అన్న భర్తమాట వినిపించి పాతాళంలోకి క్రుంగిపోతున్నట్టుగా అనిపించింది.

దుఃఖం. కసి. కుమారిలా ఒంటిమీద కిరోసిన్ పోసుకు చచ్చిపోదామనిపించింది. తను చస్తే నెల తిరక్కుండానే మళ్ళీ పెళ్ళికొడుకు అవడూ! ఆ వచ్చిన దానికి మళ్ళీ ఇదే గతి పట్టదూ? పుట్టింటికి వెళ్ళిపోతే? రుక్మిణిమాట యదార్థం అవుతుంది. చివరికి పుట్టింటి ఆదరణను కూడా కోల్పోయిన దవుతుంది!

తనకి ఉద్యోగంవచ్చే చదువుంది. ఉద్యోగం ఇప్పించే స్నేహితులున్నారు. ఉద్యోగస్తురాలౌతే సమస్య తీరిపోయినట్టేనా? తనను చుట్టుముట్టే ఒంటరి తనాన్ని ఏం చేయాలి? మళ్ళీ ఈ మగాడి దగ్గరికే పరిగెత్తుకు రావాలా? అప్పుడూ రుక్మిణి మాటే నిజమౌతుంది! ఈ సమాజంలో మగవాడికి ఏన ఒంటరితనాన్ని పోగొట్టు కోవడానికి లక్షమార్గాలున్నాయి. కాని, ఆడదానికి తాళికట్టిన మగడు తప్ప మరో మార్గంలేదే!

ఎవరు సృష్టించారీ నీతిని?

ఎవరు ఏర్పరిచారీ కట్టుబాట్లను?

కట్టుబాట్లు మనిషి మనుగడకు సుస్థిరత్వాన్ని ఏర్పరిచేవే అయితే అవి స్త్రీపురుషులకు సమానంగా ఎందుకులేవు?

సంప్రదాయాలు సంకెళ్ళుగా మారినప్పుడు వాటిని త్రెంచుకొని మనిషి స్వేచ్ఛాజీవి కావ



డంలో తప్పేముంది?

జయలక్ష్మి ఆవేశంతో ఒక నిర్ణయానికి వచ్చేసింది.

తనీ సంసారం చేయదలుచుకోలేదని, వెళ్ళిపోయి తన బ్రతుకు తాను బ్రతుకగలనని ఒక చీటీ వ్రాసి టేబిల్ మీద పెట్టేసి, సూటుకేసు సర్దుకొని ఇంటికి తాళంపెట్టి ఆయనవస్తే తాళం చెవి ఇమ్మని చెప్పడానికి రుక్మిణి దగ్గిరికి వెళ్ళింది.

జయలక్ష్మి నిర్ణయం విని రుక్మిణి అంది: "చాలా తొందరపాటుతో కూడిన ఆలోచన. జయా! ఇలాంటి విషయాల్లో ఆడది సహనం చూపడం నామోషీగా, అబలత్వంగా, బానిస లక్షణంగా ఎందుకు భావిస్తున్నావు? వెళ్ళిపోయి నీ బ్రతుకు నువ్వు బ్రతకడంతో తీరిపోతాయా సమస్యలు? మురళీధర్ నీ భర్త కాదను కొందాం మాట వరుసకి! ఇంకెవరో! అతడు త్రాగుబోతూ—నీ మాటప్రకారం సప్త వ్యసన పరుడూ! ఇలాంటి వ్యసన పరులింకా ఈ సమాజంలో ఇంకా ఎంత మందిలేరు? అనాగరికుడు కల్లు పాకలో దూరి సీసాలు కాళీచేస్తే నాగరికుడు బార్ కెళ్ళి జేబు కాళీ చేసుకొంటాడు! కంపెనీ కోసం అంటూ దాని కొక ముద్దుపేరు పెట్టుకొంటాడు! మొత్తానికి ఇద్దరూ ఇల్లూ, ఒళ్ళూ గుల్ల చేసుకొంటారు! ఇంటిని నరకంగా మారుస్తారు! అంతమాత్రంచేత తాము చేస్తున్న పని తప్పని తెలియకపోదు వీళ్ళకు. ఆ దారి నుంచి వెనుకకి మరలాలనీ అనుకోకపోరు! కాని, వాళ్ళు నిలబడింది పాకుడు పట్టిన బండ! పాకుడు బండమీద నిలబడిన మనిషి అడుగులు ఎటు జారితే అటు పోవలసిందేగాని తా ననుకొన్నట్టుగా నడవలేడు! ముందు అతడిని ఆ పాకుడుబండ మీదినుండి ఇవతలికి లాగాలి! అప్పుడుగాని అతడి స్వాధీనంలో అతడుండడు!

"అతడు నీ భర్తగా మరిచిపోయి ఒక మనిషిగా మాత్రమే గుర్తుంచుకొని అతడిని సంస్కరించడానికి సంసిద్ధురాలివి కావాలి! అతడిని సంస్కరించి నీ వాణ్ణి చేసుకొన్నప్పుడు నువ్వు గొప్పదానివి అవుతావుగాని, 'నే నీ కాపురం చేయలేను నా ఇష్టం వచ్చినట్టు నేను బ్రతుకు తాను' అని వెళ్ళిపోవడంలో వ్యక్తి స్వేచ్ఛ కాక నీ స్వార్థమే అగపడుతోంది నాకు!"

"నిజంగా వీళ్ళు నిల్చున్నది పాకుడు బండరే. వీళ్ళని ఇవతలికి లాగడం ఎవరికి సాధ్యం" జయలక్ష్మి నిస్పృహగా అంది.

"సహనవంతులకి! నీ తెలివి తేటల్ని ఇందుకు ఉపయోగించు, సమానత్వం కోసం దెబ్బలాటకి కాక ఇలాంటి మనుషులను సంస్కరించి ఒక మనిషిగా తీర్చిదిద్దగలిగిన రోజు నిజంగా నువ్వు గర్వపడాల్సింది! ఇప్పుడు కాదు. నువ్వు వెళ్ళిపోకు, జయా! అడ్డుపెట్టే వాళ్ళు లేకపోతే అతనింకా చెడిపోతాడు!"

జయలక్ష్మి అంతరంగంలో సూటిగానే నాటాయి రుక్మిణి మాటలు!

తాళంచెవి తిరిగి వెనక్కి తీసుకొని ఉమ వాటాకేసి నడిచింది.

జయలక్ష్మి ముఖంలో ఇప్పుడు ఆ అలజడీ, అశాంతీలేవు. □

అప్పు

తీరని అప్పు
ఆరని నిప్పు
తెచ్చును ముప్పు
కాదంటావా, నీవే చెప్పు?

—ఇ. ఎల్. నారాయణ